ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం
జిల్లా వార్తలు

శుక్రవారం 21 నవంబరు 2025



సత్యసాయి మహాసమాధికి పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, పక్కన ఆర్‌జే రత్నాకర్



నిస్వార్థ సేవాదళ్..!

అవసరమైనచోట అండగా నిలుస్తారు..అసౌకర్యాల నడుమ సేవలు అందిస్తారు

- సత్యసాయి బోధనలతో భక్తుల సేవామార్గం
- కొనియాడిన కేంద్ర మంత్రి గడ్కరీ, ట్రస్టు ప్రతినిధులు
- ప్రశాంతి నిలయంలో సత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు
- 45 దేశాల నుంచి 2,500 మంది ప్రతినిధుల హాజరు

పుట్టపర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు సత్యసాయి సేవాదళ్ నిదర్శనమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు, ప్రతినిధులు కొనియాడారు. సత్యసాయి బోధనలే వారిని సేవామార్గంలో నడిపిస్తున్నాయని అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు మందిరంలో గురువారం శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు రత్నాకర్, చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో కార్యక్రమం మొదలైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి గడ్కరీ, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం సదస్సులో ప్రసంగించారు. సత్యసాయి జీవితం, బోధనలు, విలువలు, ప్రేమతత్వం, మానవాళిని శాంతిజీవనం వైపు నడిపిస్తున్నాయని అన్నారు. ఇక్కడి భక్తి, సేవలను చూసి.. మరిన్ని మంచి పనులు చేసేందుకు ప్రేరణ పొందాలని వచ్చానని తెలిపారు.

సేవాదళ్‌కు ముఖ్యమైన సదస్సు..

భగవాన్ సత్యసాయిబాబా అందించిన సేవ, ప్రేమ, స్ఫూర్తితో సేవాదళ్

(మిగతా 6లో..)



సాయికుల్వంత్ హాలులో ప్రదర్శనగా వస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురితో డబ్బు వసూలు



అనంతపురం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం భూసంరక్షణా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హసీనాపై ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. తాను రెవెన్యూ శాఖలో ఆర్ఐగా పని చేస్తున్నానని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తానని పలువురితో ఆమె భారీగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు, రాయదుర్గానికి చెందిన మరొకరితో రూ.26లక్షలకుపైగా వసూలు చేసింది. వీరితో పాటు మరికొంత మందితో ఆమె డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బులు తీసుకొని ఉద్యోగం చూపకపోవడంతో బాధితులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గుత్తి ఏడీఏ వెంకటరాముడును విచారణ అధికారిగా నియమించారు. ఆయన విచారణలో జూనియర్ అసిస్టెంట్ బాగోతం వెలుగు చూసింది. ఈక్రమంలో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తారన్న సమాచారంతో ముందస్తుగానే గత సెప్టెంబరు మొదటి వారంలో ఆమె సెలవులో వెళ్లారు. ఆ తర్వాత విధులకు హాజరుకాలేదు. భూసంరక్షణా విభాగం ఉన్నతాధికారి పలు మార్లు మోమోలు జారీ చేసినా స్పందించలేదు. విచారణకు హాజరైన సమయంలో డిపార్టుమెంట్ బ్యాంక్ ఖాతాకు చెందిన 15కుపైగా చెక్కులపై బయట వ్యక్తుల పేర్లు రాసుకొని, వారికి చెక్కులు చూపించి, మభ్యపెట్టేందుకు ప్రయత్నించినట్లు తేలింది. డిపార్టుమెంట్ ఖాతాకు చెందిన చెక్కులపై ఇతరుల పేర్లు రాయడంపై భూసంరక్షణా విభాగం అధికారులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇంతగా మోసాలకు పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ కారుణ్యనియామకంపై ఉద్యోగంలో చేరడం గమనార్హం. ఆమె ఇలా చేయడం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. జూనియర్ అసిస్టెంట్ వ్యవహారంపై జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం కమిషనరేట్‌కు నివేదికలు పంపినట్లు తెలిసింది.

మీనరాసి..!

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మత్స్య సంపద
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- ఏటా 4 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి
- ఐదు రకాల చేపలు... రూ.80 కోట్ల పైబడి ఆదాయం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



7

బుగ్గ రామలింగేశ్వరుడికి భస్మాలంకరణ



తాడిపత్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరిరోజు స్వామివారు భస్మాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పథకాలను రైతులకు చేరవేయాలి: కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పథకాలు, కార్యక్రమాలను సాంకేతికత సాయంతో క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయాలని కలెక్టర్ ఆనంద్.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 1,07,261 హెక్టార్లు కాగా.. ఇప్పటివరకు 43,348.2 హెక్టార్లలో పంటలు సాగు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. లక్ష్యాలను అధిగమించేందుకు అన్ని శాఖలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం లక్ష్మానాయక్, డీసీఓ అరుణకుమారి, ఆత్మా పీడీ పద్మలత, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, నాబార్డ్ ఏజీఎం అనూరాధ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీకి 8మంది విద్యార్థులు

అనంతపురం విద్యనవంబరు 20(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఎనిమిది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో ఈసారి విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల, నియోజకవర్గస్థాయిలో పోటీలు పెట్టి, ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఆ వివరాలను కమిషనరేట్‌కు డీఈఓ పంపారు. అక్కడ కేటగిరీల వారీగా నియోజకవర్గం నుంచి ఒకరు చొప్పున జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థులను ఎంపికచేసి, జాబితాను గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపారు.

మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులు

గంగోత్రి (జడ్పీహెచ్‌ఎస్, లింగదహాల్, రాయదుర్గం), లోకేశ్ (జడ్పీహెచ్‌ఎస్, పెద్ద కౌకుంట్ల, ఉరవకొండ), స్వప్న (జడ్పీహెచ్‌ఎస్, గుత్తి ఆర్ఎస్, గుంతకల్లు), అనిల్‌కుమార్ (జడ్పీహెచ్‌ఎస్ యాడికి, తాడిపత్రి), శిరీష (గురుకుల పాఠశాల, కొర్రపాడు, శింగనమల), సదాఫ్‌నాజ్ (శారదా మున్సిపల్‌బాలికల హైస్కూల్, అనంతపురంఅర్బన్), తలారి అభిజ్ఞ (జడ్పీజీహెచ్‌ఎస్, కళ్యాణదుర్గం), శ్యాంశ్రీనాథ్‌రెడ్డి (ఏపీమోడల్ స్కూల్, రాప్తాడు)ను మాక్ అసెంబ్లీకి ఎంపిక చేశారు. వీరందరూ ఈనెల 22వతేదీ రాత్రి అమరావతికి బయలుదేరి వెళ్తారు. 26వ తేదీ వరకు అక్కడే ఉంటారు. మూడురోజులుపాటు వీరికి మాక్ అసెంబ్లీపై శిక్షణ ఇస్తారు. ఈనెల 26న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ సమక్షంలో ఆ విద్యార్థులు.. స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రల్లో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారని డీఈఓ ప్రసాద్‌బాబుతెలిపారు.

సదరం ట్రాన్స్‌ఫర్..!

- జిల్లాలో స్లాట్‌లు భర్తీ
- ఇతర ప్రాంతాల్లో బుకింగ్
- తిరిగి ట్రాన్స్‌ఫర్ చేయిస్తామని హామీ
- రూ.5వేల నుంచి రూ.10వేలు డిమాండ్
- సదరంలో దళారుల కొత్త పంథా

అనంతపురం వైద్యం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం సదరం స్లాట్ బుకింగ్‌లో దళారులు కొత్త పంథాలను ఎంచుకుంటున్నారు. తొలుత స్లాట్‌లను బ్లాక్ చేసి, డబ్బులిచ్చిన వారికి బుకింగ్ చేశారు. జిల్లాలో స్లాట్‌లన్నీ భర్తీ అయ్యాయి. దళారులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ట్రాన్స్‌ఫర్ పేరుతో దరఖాస్తుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్లాట్ బుకింగ్ చేసి, తర్వాత జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తామని నమ్మబలుకుతున్నారు. అందుకుగాను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. దళారులను సంప్రదించాలని దరఖాస్తుదారులకు మీసేవ కేంద్రాల సిబ్బందే సూచిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

రెండ్రోజుల్లోనే ఫుల్

ఉమ్మడి జిల్లావాసులు ఆధార్ అడ్రస్ మేరకు సంబంధిత ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం క్యాంపులకు స్లాట్‌బుకింగ్ చేసుకోవాలి. విభిన్న ప్రతాభావంతులకు వ్యయప్రాయాసలను తగ్గించేందుకు ఈ వెసులుబాటు కల్పించారు.

రూ.5వేల నుంచి రూ.10వేలు డిమాండ్..



ఉమ్మడి జిల్లాలో 14 ఆస్పత్రుల్లో వైద్య, ఆరోగ్యశాఖ సదరం క్యాంపులను నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల్లో ఉమ్మడి జిల్లాకు సరిపడా స్లాట్‌లు రూపొందించలేదు. దరఖాస్తుదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, సదరం స్లాట్ బుకింగ్ ద్వారా దండుకోవడానికి దళారీలు వెనకాడటంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో స్లాట్ బుకింగ్‌కు రూ.1500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడ సాట్లు భర్తీ అయితే ఇతర జిల్లాల్లో బుకింగ్ చేసి తిరిగి ఈప్రాంత సదరం క్యాంపు ఆస్పత్రులకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫర్‌కు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డిమాండ్ చేస్తున్నారని బాధిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

సదరం క్యాంపు నిర్వహించే ఆస్పత్రుల్లో వైద్యుల సంఖ్యను బట్టి స్లాట్ల ఖాళీలను రూపొందించారు. ఆ మేరకు స్లాట్లను దళారులు డబ్బులిచ్చిన వారికి బుకింగ్ చేయించుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా సదరం క్యాంపుల ఆస్పత్రుల్లోని స్లాట్లు శుక్ర, శనివారాల్లోనే భర్తీ అయ్యాయి. దళారులను సంప్రదించని వారికి సచివాలయ, మీసేవా కేంద్రాల సిబ్బంది ఇతర జిల్లా, ప్రాంతాల్లోని సదరం క్యాంపులకు స్లాట్‌లను బుకింగ్ చేస్తున్నారు. ఇదేంటని బాధితవర్గాలు ప్రశ్నిస్తే.. 'ఏం పర్వాలేదనీ, కొన్నిరోజుల తరువాత జిల్లాలోనే ఖాళీ అవుతాయనీ, అప్పుడు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చ'ని సలహాలిస్తున్నారు. దళారులను సంప్రదిస్తే వారే.. అధికారుల ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయిస్తారని స్లాట్‌బుకింగ్ చేసిన సిబ్బంది చెబుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు.

దళారీలను నమ్మవద్దు

సదరం స్లాట్ బుకింగ్ కోసం దళారులను నమ్మవద్దు. అక్రమాలకు పాల్పడే దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా సిఫార్సు చేస్తాం. అర్హులైన దివ్యాంగులు అందరికీ సదరం స్లాట్‌బుకింగ్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఇందులో భాగంగానే సచివాలయాల సందర్శనకెళ్లి విభిన్న ప్రతిభావంతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-నారాయణస్వామి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్



బాధితులతో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి

మీ'సేవ'లోనే...



మూడు నెలలకోసారి సదరం స్లాట్‌బుకింగ్ అవకాశం వస్తుంది. సదరం సర్వర్ ఓపెన్ అయిన గంటల్లోనే మొత్తం స్లాట్‌లు బుకింగ్ అవుతున్నాయి. దీంతో సచివాలయాలకెళ్లి స్లాట్ బుకింగ్ చేసుకోవాలనుకునే వారికి నిరాశే ఎదురవుతోంది. అత్యధిక స్లాట్‌లు మీసేవ కేంద్రాల్లో బుకింగ్ అవుతుండడమే ఇందుకు కారణం. సచివాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఉదయం 10 గంటలకు డ్యూటీలకు వస్తారు. ఇదే అదనుగా భావించి మీసేవ కేంద్రాల్లో ఉదయం 10 గంటల్లోపే స్లాట్‌లను భర్తీ చేస్తున్నారు. దళారీలు అత్యధికంగా మీసేవ ద్వారానే అక్రమాలకు పాల్పడుతున్నారు. సచివాలయాలకు కాళ్లరిగేలా తిరగడం మినహా పనికావడంలేదని బాధితులు వాపోతున్నారు.

జిల్లాలో రహదారులను అభివృద్ధి చేస్తాం

- మంత్రులు, ఎమ్మెల్యేలకు కేంద్రమంత్రి గడ్కరీ హామీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారు. పుట్టపర్తి పర్యటనకు వచ్చిన ఆయన గురువారం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస అతిథి గృహంలో జిల్లాలో రహదారుల ప్రగతిపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల ఏర్పాటుపై ఆరాతీశారు. ఎమ్మెల్యేలు, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తమ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితిపై కేంద్రమంత్రితోపాటు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పెనుకొండ వద్ద జాతీయ రహదారి-44 నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, సీజీ ప్రాజెక్టు, కొక్కంటి క్రాస్ మీదుగా చెన్నై జాతీయ రహదారితో కలపాలని కేంద్రమంత్రిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన ఆర్అండ్‌బీ రోడ్లు, దెబ్బతిన్న బీటీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖా (మిగతా 6లో...)



కేంద్రమంత్రికి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

టమోటా @ 50

భారీగా పెరిగిన ధర



7

బయోమెడికల్ వ్యర్థాలతో జాగ్రత్త

నిర్వహణలో నిబంధనలు తప్పక పాటించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జారీచేసిన నిబంధనలు అమలు చేయాలన్నారు. ఆస్పత్రుల్లో కాలంచెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయాలన్నారు. అలాంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోస్తే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. రెడ్, యెల్లో, బ్లూ, వైట్‌రంగుల బయో కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజెక్షన్లు, పత్తి, గ్లౌ, శరీర వ్యర్థాలు వంటి వాటిని వేర్వేరు సంచుల్లో వేయాలని సూచించారు. అనంతరం 'వ్యర్థ పదార్థాల నుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, వైద్యఆరోగ్య అధికారి విష్ణుమూర్తి, ప్రజారోగ్య శాఖ ఈఈ ఆదినారాయణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

మొరాయించిన సుబ్బరాయసాగర్ గేట్లు

పుట్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ గేట్లు మొరాయించాయి. ఈనెల 13న రిజర్వాయర్ నుంచి పుట్లూరు చెరువుకు నీటిని విడుదల చేశారు. కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్న నేపథ్యంలో నాలుగు అడుగుల మేర గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. రెండురోజుల క్రితం హెచ్చెల్సీ అధికారులు గేట్లు ఎత్తడానికి ప్రయత్నం చేయగా షట్టర్లకు ఉన్న రాడ్ కట్ కావడంతో వీలుకాలేదు. విషయాన్ని అధికారులు.. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈ సూర్యనారాయణ, ఏఈ శ్రీనివాసులు.. కర్ణాటక రాష్ట్రం హోస్పేట నుంచి నిపుణులను రప్పించి మరమ్మతులు చేపట్టారు. గేట్లు పూర్తిగా పైకి లేవకపోవడంతో క్రేన్, ఎక్స్‌కవేటర్ సాయంతో ప్రయత్నించారు. వాటితో కూడా గేట్లు తెరుచుకోలేదు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి నిపుణులను రప్పించి గేట్ల మరమ్మతులు చేయించి నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



క్రేన్ సాయంతో గేటును ఎత్తేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు



సత్యసాయిబాబా 75వ జన్మదినం సందర్భంగా 2000 సంవత్సరంలో చైనా మూరిష్ గోతిక్ జపనీస్ శైలిలో నిర్మించిన అద్భుత భవనం చైతన్య జ్యోతి మ్యూజియం ప్రారంభించబడింది. ప్రత్యేక ఆకర్షణతో బాబా జీవితం, వారి ప్రపంచసేవామిషన్‌పై రూపొందించిన అంశాలు ఇందులో ఉంటాయి. ఏడు విభిన్న విభాగాలుగా సృజనాత్మకంగా ఏర్పాటు చేసిన మల్టీమీడియా ద్వారా బాబా జననం, బాల్యం, అవతార ప్రవచనాలు బాబా దివ్యమిషన్ ముఖ్యఘట్టాల ప్రదర్శన సందర్శకులకు మధురానుభూతిని ఇస్తుంది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ చైతన్య జ్యోతి మ్యూజియాన్ని ఉచితంగా సందర్శించవచ్చు. సోమవారం సెలవు.

● శాంతివేదిక

హిల్‌వ్యూ స్టేడియంలో ఏ కార్యక్రమం జరిగినా ప్రధాన వేదిక శాంతివేదికపై సత్యసాయి బాబా ఇతర ప్రముఖులు ఆశీనులై కార్యక్రమాలను వీక్షించేవారు. ప్రస్తుతం శతజయంతి ఉత్సవాలను సైతం దేశప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు శాంతివేదికపై ఆశీనులై వీక్షించారు.

రా..రమ్మని..!

పుట్టపర్తిలో ఎన్నో రమణీయ స్థలాలు

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి రూరల్

ఊరికి తూర్పున చిందులు తొక్కే చిత్రావతి. చుట్టూ కొండలు. ఎంతో ఆహ్లాదం కలిగించే పచ్చదనం. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే వాతావరణం...ఇవీ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తి నైసర్గిక స్వరూపానికి ప్రతీకలు. సత్యసాయి బాబా శతజయంతివేళ దేశం నలుమూలల నుంచే కాక ప్రపంచ దేశాల నుంచి సైతం అనేక మంది భక్తులు పుట్టపర్తికి వస్తున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధి మాత్రమే కాక పుట్టపర్తిలో చూడదగ్గ మరిన్ని ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇలా..



●అతిపెద్ద హనుమాన్ విగ్రహం

సత్యసాయి బాబా 65వ జన్మదినాన్ని పురస్కరించుకుని హిల్‌వ్యూస్టేడియంలో 65 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1990 నవంబరు 22న సత్యసాయి ఈవిగ్రహాన్ని ఆవిష్కరించారు. హనుమాన్ విగ్రహంతో పాటు బుద్ధ, శివ, కృష్ణ, జీసస్, జొరాస్టర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు.



● హిల్‌వ్యూ స్టేడియం

పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన అద్భుత క్రీడా ప్రాంగణం హిల్‌వ్యూ స్టేడియం. సత్యసాయి విశ్వవిద్యాలయ పరిధిలో భాగంగా ఈస్టేడియాన్ని అద్భుతంగా నిర్మించారు. దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులు, భక్తులు ఇక్కడ ప్రతిఏటా జనవరి 11న జరిగే క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 1997లో సత్యసాయి యూనిటీ కప్ పేరిట ఇండియాలెవన్, వరల్డ్‌లెవన్ జట్ల మధ్య ప్రత్యేకమైన క్రికెట్ పోటీని నిర్వహించారు. నాటి మ్యాచ్ సచిన్‌టెండూల్కర్ 88 పరుగులతో విజృంభించడంతో ఇండియా లెవన్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది.

తర్వాత బ్యాటింగ్ చేసిన వరల్డ్ లెవన్ జట్టు 26.2 ఓవర్లలోనే 165 పరుగులకు కుప్పకూలింది. ఆ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా అప్పటి ప్రధాని ఐకే గుజ్రాల్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ హాజరయ్యారు.



● సత్యసాయి స్పేస్ థియేటర్

ప్రశాంతినిలయం విద్యాగిరి విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న సత్యసాయి స్పేస్ థియేటర్ గ్రామీణప్రజలకు ఖగోళశాస్త్రం, విజ్ఞానం గురించి అవగాహన కల్పించడానికి స్థాపించబడింది. ఇక్కడ ప్రతిరోజు జరిగే ప్రదర్శనలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. తెలుగు ఇంగ్లిషు, హిందీభాషలలో ఉదయం 10.30 గంటలకు ప్రవేశం ఉంటుంది.

● సనాతన సంస్కృతి మ్యూజియం



1990లో స్థాపించిన మొట్టమొదటి మ్యూజియం ఇది. మానవ ఆధ్యాత్మిక వికాసాన్ని ప్రపంచంలోని ప్రధాన మతాల విలువలను శిల్పాలు, చిత్రాలు ప్రదర్శన రూపంలో ఇక్కడ చూపిస్తారు. సత్యసాయి బాల్యలీలలు, అవతార ప్రకటన ముఖ్యాంశాలు ఇందులో ఉంటాయి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా ప్రవేశం ఉంటుంది. బుధవారం సెలవు.



● ధ్యానవృక్షం (వటవృక్షం)

1959లో సత్యసాయి స్వయంగా నాటిన మొక్క వట వృక్షంగా మారింది. దీనిపై సత్యసాయిబాబా ప్రతిష్ఠించిన యంత్రం కారణంగా ఇక్కడ ధ్యానం చేయడం సాధకులకు పుణ్యప్రదం అన్ని భక్తుల నమ్మకం. పగటి సమయంలో మాత్రమే, ప్రవేశం ఉచితం.

● సమాధి మందిరం



సత్యసాయిబాబా మాతాపితలు పెద్దవెంకమరాజు, ఈశ్వరాంబ సమాధులు ఉన్న ప్రాంతం ఇది. ప్రతి సంవత్సరం మే 6న ఈశ్వరాంబడే ఘనంగా జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేక భజనలు, పూజలు, అన్నప్రసాదం జరుగుతాయి. ఉదయం సాయంత్రం ప్రవేశం ఉచితం.





● శివాలయం.. బాబా జన్మస్థలం

సత్యసాయి బాబా జన్మించి, బాల్యం గడిపిన పవిత్ర గృహం ప్రస్తుతం శివాలయంగా నిర్మించబడింది 1979లో బాబా ఆలయాన్ని స్వయంగా ప్రారంభించారు.

● **కల్పవృక్షం:** పుట్టపర్తి చిత్రావతి నది ఒడ్డున ఓబులదేవరగుట్టపై ఉన్న ప్రసిద్ధ చింతచెట్టు కల్ప వృక్షంగా పేరు గడించింది. సత్యబాబా చిన్నతనంలో తన భక్తులు కోరిన పండ్లను ఈ వృక్షం నుంచి తీసి ఇచ్చారని స్థల పురాణం చెబుతోంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రవేశం ఉచితం

● పాతమందిరం.. పెదవెంకమరాజు కల్యాణమండపం

1945లో మొదట బాబా ఆలయాన్ని ప్రారంభించారు. పాత మందిరంగా పలుస్తారు. తరువాత బాబా ప్రశాంతినిలయాన్ని 1950లో నిర్మించడంతో పాతమందిరం వివాహమందిరంగా మారింది.



● **గోపాలస్వామి ఆలయం:** పుట్టపర్తి పురాతన నామం గొల్లపల్లి. గోమాతలను రక్షించేందుకు నిర్మించిన గోపాలస్వామి ఆలయం గ్రామచరిత్రలోని శాప-పరిహార కథతో అనుబంధం కలిగిఉంది.



● **సత్యమ్మ ఆలయం:** సత్యసాయిబాబా తాత కొండమరాజు నిర్మించిన ఆలయం సత్యమ్మ ఆలయం. ఇక్కడ అమ్మవారు గ్రామదేవతగా కొలువుతీరి, భక్తుల పూజలందుకుంటున్నారు.

● కలలో చూసి..: రాబర్ట్‌బుస్సీ ఫ్రాన్స్



40 సంవత్సరాలుగా ప్రశాంతి నిలయానికి వస్తున్నా. అంతకుముందు ఒకరోజు రాత్రి 'ప్రశాంతి నిలయానికి రా. అక్కడ నీకు అంతులేని ప్రశాంతత ఇస్తా' అని కలలో కనిపించి చెప్పారు. తెల్లవారిన తర్వాత నాకు ఏమి అర్థం కాలేదు. మరు నాడు ప్యారిస్‌లో పెద్ద పార్టీ జరిగింది. ఆ పార్టీకి నాకు సంబంధం లేక పోయినా ఆహ్వానం వచ్చింది. వెళ్లాను. అక్కడ హోటల్ గదిలో అంతకు మునుపు ఉన్నవారు స్వామి ఫొటో మరిచిపోయారు. ఆ ఫొటోలో బాబాను మొట్టమొదటి సారి చూశా. అంతకు ముందు రోజు రాత్రి కలలో చూసిన వ్యక్తి ఆ ఫొటోలో ఉన్న వ్యక్తి ఒక్కరే. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెంటనే ఇండియాకు వచ్చా. నేను ఇండియాకు రావడం అదే తొలిసారి. ఇక్కడ అడుగు పెట్టగానే ఏదో తెలియని ప్రశాంత అనుభూతి కలిగింది. ప్రశాంతినిలయానికి వచ్చిన రోజు సాయంత్రమే స్వామి నాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఒక రింగ్ బహూకరించారు. నాటి నుంచి ప్రతి ఏటా ప్రశాంతి నిలయానికి వస్తున్నా.

జిల్లాలో రహదారులను అభివృద్ధి చేస్తాం



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రాలు అందజేస్తున్న మంతులు, ఎమ్మెల్యేలు

(5వ పేజీ తరువాయి)

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో రహదారులులేని గ్రామాల వివరాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. అనంతరం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర నాయుడు, సురేష్ చౌదరి, పీసీ గంగన్న, బీజేపీ నాయకులు లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, సూర్యనారాయణ, కల్యాణ్ కుమార్, నారాయణ, రామాంజి, రాయల్ మురళి పాల్గొన్నారు.

విస్తరించాలి

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలో జాతీయ రహదారులను మరింత విస్తరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. కేంద్ర మంత్రిని కోరారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు పరిధిలో శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ముదిగుబ్బ నుంచి పెనుకొండ మీదుగా చెళ్లకెర వరకు అంతర్రాష్ట్ర రహదానిని విస్తరించాలనీ, సోమందేపల్లి నుంచి హిందూపురం, దొడ్డబళ్లాపురం మీదుగా యలహంక వరకు వెళ్లే రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చాలనీ, హైదరాబాద్-బెంగళూరు ఎన్‌హెచ్-44ను ఆరులైన్ల రహదారిగా విస్తరించాలని కేంద్రమంత్రిని ఆమె కోరారు.

జిల్లా కేంద్రంతో అనుసంధానించాలి

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టిన జాతీయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రహదారుల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు.

రాష్ట్రాల రహదారులను కలపాలి

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కర్ణాటకతో రహదారులను అనుసంధానించి విస్తరించేలా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. అనంతపురం-ఎగువపల్లి రహదారి సమస్యను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు. డబుల్‌లైన్‌గా విస్తరించాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు రూ.35 కోట్లు నిధులు అవసరమవుతాయని వాటిని మంజూరు చేయాలని కోరారు.

జాతీయ రహదారితో అనుసంధానించాలి

పుట్టపర్తి నుంచి మడకశిర మీదుగా హిరియూర్ వరకు రోడ్లను ఎన్‌హెచ్ 44తో అనుసంధానం చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. పుట్టపర్తి నుంచి పెనుకొండ, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని హిరియూర్ వరకు ఎన్‌హెచ్ 44కు అనుసంధానం చేయాలని విన్నవించారు.

అమృత్ పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఆనంద్


అనంతపురం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమృత్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ సెక్టార్‌పై పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పబ్లిక్ హెల్త్ పరిధిలో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా పనుల్లో ప్రతివారం పురోగతి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, మున్సిపల్ ఆర్డీ నాగరాజు, అనంత నగరపాలక సంస్థ డీసీ పావని పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి మహారాష్ట్ర సీఎం రాక

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం పుట్టపర్తికి రానున్నారు. ఉదయం 9.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం ప్రశాంతి నిలయం చేరుకుని, సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. తర్వాత ముంబై బయలుదేరి వెళతారు. సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి శనివారం ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కూడా పుట్టపర్తికి వస్తున్నారు.

సత్యసాయి స్టాంపులు.. గంటలోనే సేల్

పుట్టపర్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు గంటలోపే అమ్ముడయ్యాయి. హిందూపురం డివిజన్‌కు 1200 స్టాంపులను విడుదల చేయగా.. అన్నీ అయిపోయాయని పోస్టల్ సూపరింటెండెంట్ (హిందూపురం డివిజన్) విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. త్వరలోనే స్టాంపులను అందుబాటులోకి తెస్తామన్నారు.



ప్రధాని మోదీ విడుదల చేసిన సత్యసాయి పోస్టల్ స్టాంపులు

నిస్వార్థ సేవాదళ్..!



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ, నిమీష్‌పాండే, నాగానందం

(5వ పేజీ తరువాయి)

సభ్యులు సేవలు నిర్వహిస్తున్నారని, నిస్వార్థసేవలకు వారు నిదర్శనంగా నిలుస్తున్నారని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే అన్నారు. సేవాదళ్ సభ్యులకు ఈ సదస్సు చాలా ముఖ్యమైనదని అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా తన ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలతో లక్షల మంది భక్తులను సేవామార్గంవైపు పయనించేలా చేశారని అన్నారు. సత్యసాయి సేవాదళ్ సభ్యులు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా తమ తమ ప్రాంతాలలో విద్య, వైద్యం, తాగునీరు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవలు, యువతకు ఉపాధిపై శిక్షణ, బాలవికాస్ విద్య ద్వారా బోధన అందిస్తున్నారని అన్నారు. సత్యసాయి మార్గమే తమకు శిరోధార్యం అని, అదే సేవాదళ్‌కు స్ఫూర్తి అని అన్నారు.

బాబా సేవలు ప్రపంచ వ్యాప్తం..

శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సుకు 45 దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారని సత్యసాయి సేవాసంస్థల యూకే ప్రతినిధి సురేశ్ మీనన్ అన్నారు. సత్యసాయి బాబా ఆధ్యాత్మిక బోధనలు, సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని, భక్తులను సేవలపై నడిపిస్తున్నాయని అన్నారు. నేపాల్, ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ సహా పలు దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. సత్యసాయి సేవాదళ్ బ్రాంచ్‌లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, నిస్వార్థ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. 75 మంది విదేశీ డాక్టర్లు, 200 మంది భారతీయ డాక్టర్లు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. మనిషి హృదయమనే ఇంటిలో శాంతి అనే దీపం వెలిగించినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. దీనికోసం సేవాదళ్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు కొనసాగిస్తున్నారని అన్నారు. అనంతరం సత్యసాయి అంతర్జాతీయ సదస్సుపై ట్రస్టు ప్రతినిధులు పుస్తకాన్ని విడుదల చేశారు.

సౌకర్యాలు లేకపోయినా సేవకు..

ఎలాంటి అనుకూలత, వసతి లేనిచోట సత్యసాయి సేవాదళ్ సభ్యులు సేవా కార్యక్రమాలను అంకితభావంతో కొనసాగిస్తున్నారని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానందం అన్నారు. సత్యసాయి భక్తులు, సేవాదళ్ ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా భావిస్తారని అన్నారు. ఎక్కడ ఎలాంటి విపత్తు, ఆపద ఎదురైనా అక్కడికి వెళ్లి అవసరమైన సేవలను అందిస్తారని కొనియాడారు. ప్రశాంతి నిలయంలో నేర్చుకున్నవాటిని ప్రచారం చేయడమే పరమావధిగా సత్యసాయి సేవాదళ్ సభ్యులు ముందుకు వెళుతున్నారని అన్నారు. సదస్సు అనంతరం సాయి కుల్వంత్‌లో భక్తులు సంగీత కచేరీని నిర్వహించారు. అంతర్జాతీయ సదస్సుకు ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, ప్రసాద్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రులు పల్లె రఘునాథ రెడ్డి, గీతారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

నువ్వేమి చేశావు పాపం..!



శిశువును శిశువిహార్‌కు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

పసికందు ప్రాణం..
దినదిన గండం..
పుట్టిన రోజు నుంచే..
మృత్యువుతో పోరాటం..
రోజుల పాపను కన్న తండ్రే..
డ్యాం వద్ద పడేశాడు..
అమ్మానాన్న అందరూ ఉన్నా..
అనాథలా.. మారింది..
శిశువిహార్‌కు చేరింది..
నేనున్నానంటూ
అమ్మమ్మ వచ్చింది..
అమ్మలా చూసుకుంటానంది..
నమ్మి అప్పగిస్తే..
ఏం చేసిందో..
ఎవరు ఎత్తుకెళ్లారో..
నిత్య గండాల పసికందు..
ఏమైపోయిందో..
ఎవ్వరికీ తెలియదు..
అందరూ కలిసి..
అదృశ్యం చేశారు..
ఓ పసిపాపా..
నువ్వేమి చేశావు పాపం..
ఎక్కడున్నావమ్మా..
ఎక్కడో.. ఒకచోట..
నువ్వు సల్లగా ఉండాలి..

ఓ పసిగుడ్డు కన్నీటి కథ ఇది. పుట్టిన రోజు నుంచి నిత్యం మృత్యువుతో పోరాటమే. 45రోజుల ఆ శిశువు ఎక్కడుందో, ఎవరికీ తెలియదు. నంబులపూలకుంట మండలకేంద్రంలోని రెడ్డెప్ప, రాధమ్మ దంపతులకు మొదటి కాన్పులో ఆడ శిశువు జన్మించింది. శిశువు ఉండడంతో రాధమ్మ తనను దగ్గరకు రానివ్వలేదన్న కోపంతో ఆమె భర్త రెడ్డెప్ప బిడ్డను కడప జిల్లా వెలిగల్లు రిజర్వాయర్ సమీపంలో గతనెల 17న పడేశాడు. ఆ దారి గుండా వెళ్తున్న ఓ మహిళ గమనించి గాలివీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు చెట్లలో పడి ఉన్న ఆ శిశువును స్టేషన్‌కు తీసుకెళ్లారు. నంబులపూలకుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాధమ్మను విచారించి, ఆమె చెంతకు శిశువును చేర్చారు. మండల పోలీసు స్టేషన్‌లో ఆయా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒకరోజు శిశువును సంరక్షించారు. అనంతరం పుట్టపర్తి శిశువిహార్‌కు తరలించారు. శిశువు అమ్మమ్మ గంగాదేవి శిశువిహార్‌కు ఫోన్ చేసి శిశువును ఇవ్వాలనీ, తాము సంరక్షించుకుంటామని చెప్పడంతో పదిరోజుల క్రితం తీసుకొచ్చారు. శిశువిహార్, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది.. తల్లీబిడ్డను పర్యవేక్షించాలని సూచించారు. ఈనెల 17న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్త.. శిశువు ఇంటి వద్దకెళ్లి పరిశీలించగా, కనిపించలేదు. బుధవారం వెళ్లి శిశువు ఎక్కడ అని అమ్మమ్మ గంగాదేవిని విచారించగా.. ఎవరో తీసుకెళ్లారని చెప్పింది. సీడీపీఓ రాధమ్మ, సూపర్‌వైజర్ నర్సమ్మ, కార్యకర్త చంద్రకళ.. శిశువు కనిపించలేదని బుధవారం ఫిర్యాదు చేశారు. శిశువు అమ్మమ్మను విచారించగా, అన్నమయ్య జిల్లాకేంద్రమైన రాయచోటికి వెళ్లాననీ, ఆ సమయంలో శిశువు ఏడుస్తుండగా, ఓ మహిళ చేతికిచ్చాననీ, తరువాత కనిపించలేదని పొంతనలేని సమాధానం చెప్పింది. ఆ శిశువు ఎక్కడుంది, ఎలా ఉందన్న విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. అంగన్‌వాడీల పర్యవేక్షణలోపం వల్లే శిశువు పరిస్థితి ఇలా అయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

-నంబులపూలకుంట(ఆంధ్రజ్యోతి)

శతాధిక వృద్ధురాలు మృతి



లీలావతమ్మ (ఫైల్)

రాయదుర్గం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌సీ శేషాద్రి సతీమణి లీలావతమ్మ(103) గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. లీలావతమ్మ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారని కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. కాగా ఎన్‌సీ శేషాద్రి 1955 నుంచి 62 వరకు రాయదుర్గం ఎమ్మెల్యేగా పని చేశారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బాలిక అదృశ్యం



మాచిరెడ్డి హరిత

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. అనంతపురం మూడో పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాల మేరకు హెచ్చెల్సీ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కుమార్తె మాచిరెడ్డి హరిత (17) నగరంలోని నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో, తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థిని చామన ఛాయ రంగులో ఉంటారని, 5.3 అడుగుల ఎత్తు ఉన్న ఆమె ఆచూకీ తెలిపిన వారు 9490618679, 9346917115 నంబర్లను సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకున్న రైతులు

పోలీసులకు అప్పగింత



రైతులు పట్టుకున్నది వీరినే..

యాడికి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌ను అపహరిస్తున్న ఇద్దరు దుండగులను రైతులు కాపుకాసి పట్టుకున్నారు. మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద బుధవారం రాత్రి కేబుల్ అపహరిస్తున్న ఇద్దరిని రైతులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఇద్దరు ద్విచక్రవాహనంలో వచ్చి వాహనాన్ని ఒకచోట ఆపి తోటలోకి వెళ్లారు. దీనిని పసిగట్టిన రైతులు వారు తిరిగి ద్విచక్రవాహనం వద్దకు వచ్చేవరకు అక్కడే ఉన్నారు. దుండగులు.. తోటలోని బ్యాటరీలు తీసుకుని వచ్చారు. వారిని పట్టుకుని, రైతులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించి.. వారికి అప్పగించారు. సమాచారం తెలుసుకున్న మండలంలోని రాయలచెరువు, చందన, దైవాలమడుగు, లక్షుంపల్లి గ్రామాల రైతులు గురువారం యాడికి పోలీసు స్టేషన్ వద్దకు పెద్దఎత్తున వచ్చారు. దొంగలను విచారించి తమ తోటల్లో అపహరించిన కేబుల్‌ను రికవరీ చేయాలని కోరారు. సీఐ లేకపోవడంతో తాడిపత్రిలో ఏఎస్పీని కలుస్తామని రైతులు బయల్దేరి వెళ్లారు. దొంగలు పెద్దవడుగూరుకు చెందిన వారుగా రైతులు తెలిపారు. గతంలో వారు యాడికి మండలం చందన గ్రామంలో ఉండేవారనీ, ప్రస్తుతం పెద్దవడుగూరుకు మకాం మార్చారని చెబుతున్నారు. దీనిపై సీఐ ఈరన్నను అడగ్గా.. దీనిపై విచారిస్తున్నామని తెలిపారు.

రైతుసేవా కేంద్రాల్లోనే పత్తి కొనుగోళ్లు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

పెద్దవడుగూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుసేవాకేంద్రాల్లోనే పత్తి కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమశాతం బట్టి ధర నిర్ణయిస్తారన్నారు. రైతులు పత్తి దిగుబడిని వ్యయప్రయాసాలకోర్చి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు ముని కృష్ణ, మహబూబ్‌బాషా, ముస్తాక్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

మీనరాసి..!

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మత్స్య సంపద
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- ఏటా 4 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి
- ఐదు రకాల చేపలు...
- రూ.80 కోట్ల పైబడి ఆదాయం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



కట్ల చేపలు

అనంతపురం అర్బన్/ప్రెస్‌క్లబ్/గుమ్మఘట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులు పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మత్స్యసంపద వృద్ధి చెందుతోంది. తద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. చెరువులు, రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉండటంతో చేపల పెంపకం గణనీయంగా పెరిగింది. దీంతో జిల్లా చేపలను పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తద్వారా ఏడాదికి రూ.80కోట్ల పైగా ఆదాయం గడిస్తున్నారు.

సహజ వనరు తిలాపియా...

జిల్లాలో అసలు ఖర్చు లేకుండా సహజంగా పెరిగే చేప తిలాపియా(జిలేబీ). వీటి కోసం ప్రత్యేకంగా స్పాన్(గుడ్డు) పెట్టించడం, రేరింగ్ ప్రక్రియ, చేపపిల్లల ఉత్పత్తి, వాటిని ప్రత్యేక పరిస్థితుల్లో పెంచడం లాంటివి ఉండవు. ఈ చేపకు గుడ్డు ప్రక్రియ ఉండదు. ఈ చేప సహజంగా పెరగడంతో పాటు, పిల్లలను అదే నోటి ద్వారా బయటకు వదులుతుంది. నీటిలో సహజసిద్ధంగా దొరికే ఆహారాన్ని తింటూ పెరుగుతాయి. ఏడాది కాలంలో దాదాపు కేజీ సైజులో పెరుగుతుంటాయి. జిల్లాలో ఏడాదికి దాదాపు 500 టన్నుల వరకూ ఉత్పత్తి అవుతోంది. వీటి ద్వారా దాదాపు రూ.5 కోట్ల వరకూ ఆదాయం వస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. ఈ చేపలను కేరళ, కలకత్తా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

చేప పిల్లల పెంపకం

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా అనంతపురం, ఎంపీ డ్యాం, పీఏబీఆర్, బీటీపీ మత్స్యక్షేత్రాల్లో చేపపిల్లల పెంపకం చేపడుతున్నారు. అక్కడి పెరిగిన రెండు నుంచి మూడు ఇంచుల పిల్లలను చెరువులు, డ్యాంలు, రిజర్వాయర్లకు పంపుతున్నారు. ఈ ఏడాది అధికారుల లెక్కల ప్రకారం... అనంతపురం మత్స్యక్షేత్రంలో కట్ల 20 లక్షలు, రోహు 40 లక్షలు, బంగారుమీన(మృగాల) 20 లక్షలు, బంగారుతీగ(చిప్లీస్) 2 లక్షలు చొప్పున మొత్తం 82 లక్షల చేపపిల్లలను ఉత్పత్తి చేశారు. ఎంపీ డ్యాం మత్స్యక్షేత్రంలో కట్ల 20 లక్షలు, రోహు 50 లక్షలు, బంగారుమీన 10 లక్షలు, బంగారుతీగ లక్ష చొప్పున మొత్తం 81 లక్షలు, పీఏబీఆర్ మత్స్యక్షేత్రంలో కట్ల 50లక్షలు, రోహు 80 లక్షలు, బంగారుమీన 20 లక్షలు, బంగారుతీగ 2 లక్షలు మొత్తం 1.52 కోట్లు, బీటీపీ మత్స్యక్షేత్రంలో కట్ల 30 లక్షలు, రోహు 30 లక్షలు, బంగారు మీన 15 లక్షలు, బంగారుతీగ 2 లక్షలు మొత్తం 77 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేశారు. ప్రతి ఏడాది దాదాపు 3 కోట్ల నుంచి 4 కోట్ల వరకూ చేపపిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు.

5 రకాల చేపల పెంపకం

ఉమ్మడి జిల్లాలో దాదాపు 110 సొసైటీలున్నాయి. ఈ సొసైటీల పరిధిలో దాదాపు 150 చెరువులు, 20 జీపీ ట్యాంకులు, రిజర్వాయర్లు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులు, జీపీ ట్యాంకులు, రిజర్వాయర్లు, డ్యాంలు కలిపి మొత్తం 10 వేల హెక్టార్ల విస్తీర్ణంలో చేపల పెంపకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా చెరువులు, డ్యాంలు, రిజర్వాయర్లలో ప్రధానంగా ఐదు రకాల చేపలను పెంచుతున్నారు. కట్ల, రోహు, బంగారుమీన, బంగారు తీగ, గడ్డిచేప రకం చేపలను పెంచుతున్నారు. ప్రధానంగా కట్ల చేప జిల్లాలో దాదాపు సంవత్సరానికి 1.2 కోట్ల నుంచి 1.5 కోట్ల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. రోహు 2 కోట్లు, మృగాల 65 లక్షలు, చిప్లీస్ 10 లక్షలు, గడ్డిచేప 4 లక్షల నుంచి 5 లక్షల వరకూ తయారవుతున్నాయి.



రోహు చేపలు

రూ. 80 కోట్లకుపైగా ఆదాయం

జిల్లాలో ఐదు రకాల చేపల పెంపకంతో ఏటా రూ. 80 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. కట్లా చేప ద్వారానే అధిక ఆదాయం వస్తోంది. ఏడాదికి దాదాపు 3 వేల టన్నులు కట్ల చేపలు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా రూ. 36 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. రోహు చేపలు ఏడాదికి 1000 టన్నులు ఉత్పత్తి కాగా... రూ. 12 కోట్లు ఆదాయం వస్తోంది. బంగారుమీన రకం చేపలు ఏడాదికి 1000 టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి విలువ రూ. 12 కోట్లు, బంగారుమీన రకం చేపలు ఏడాదికి 2 వేల టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.24 కోట్ల ఆదాయం వస్తోంది. గడ్డి చేపలు ఏడాదికి 20 టన్నుల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. వీటి ద్వారా రూ.2 కోట్ల వరకూ ఆదాయం వస్తోంది.

పక్క రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లాలో పెరిగే ఐదు రకాల చేపలను కోల్‌కతా, హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కోల్‌కతాలోని హౌరా మార్కెట్‌కు అనంత మత్స్య సంపదను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. కట్ల రకం చేపలు దాదాపు 3 వేల టన్నులు కోల్‌కతా, హైదరాబాద్‌లకు ఎగుమతి చేస్తున్నారు. రోహు వెయ్యి టన్నులు కలకత్తాలోని హౌరా మార్కెట్‌తో పాటు హైదరాబాద్, కర్ణాటక, బంగారుమీన రకం చేపలు కోల్‌కతాతో పాటు కర్ణాటక, హైదరాబాద్, తమిళనాడులకు ఎగుమతి చేస్తున్నారు. బంగారుతీగ రకం చేపకు జిల్లాలో అధికంగా డిమాండ్ ఉండటంతో వీటిని ఎగుమతి చేయడం లేదు.



బంగారు మీన

ప్రతి ఏటా 100 టన్నులు



బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో ప్రతి ఏటా దాదాపు 100 టన్నులకుపైగా చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. చెరువులో కట్ల, రోహు, బంగారు తీగ, గడ్డిచేపలు, జిలేబీలు పెంచుతున్నారు. 1947 సంవత్సరంలో 23 మంది సభ్యులతో సొసైటీ ఏర్పాటైంది. ప్రస్తుతం 133 మంది సభ్యులున్నారు. సంవత్సరానికి దాదాపు రూ. 30 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ఆదాయం బాగానే ఉంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

- నగేష్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు, బుక్కరాయసముద్రం మండలం

జిలేబీలే అధికం



పీఏబీఆర్ డ్యాంలో కట్ల, రోహు, జిలేబీల పెంపకం చేపడుతున్నాం. ప్రస్తుతం డ్యాంలో నీరు ఎక్కువగా ఉండటంతో జిలేబీలే అధికంగా పడుతున్నాం. కట్ల, రోహు పరిమితికి లోబడి పడుతున్నాం. సొసైటీలో 170 మంది సభ్యులున్నారు. జిలేబీలే ఏడాదికి 200 టన్నులకుపైగా ఉత్పత్తి అవుతున్నాయి. టన్ను రూ.40 వేలు పలుకుతోంది. ఇక కట్ల, రోహు చేపలు కేజీ 100 నుంచి రూ. 120లకు అమ్ముతున్నాం. మొత్తం మీద ఏడాదికి రూ. 30లక్షలకు పైబడి ఆదాయం వస్తోంది.

- బెస్త జగదీష్, అధ్యక్షుడు, పీఏబీఆర్ డ్యాం సొసైటీ, కూడేరు మండలం

చేపల సైజు పెరగడం లేదు



శింగనమల చెరువులో అన్ని రకాల చేపలు పెంచుతున్నాం. అయితే చేపలు అనుకున్న సైజులో పెరగడం లేదు. అనంతపురం, చెరువు పై ప్రాంతాల్లో నుంచి వచ్చే పరిశ్రమల కలుషితపు నీటితో చేపలు వృద్ధి చెందడం లేదు. చేపలు నల్లగా మారుతుండటంతో మార్కెట్లో గిరాకీ తక్కువగా ఉంటోంది. ప్రభుత్వం స్పందించి కలుషిత నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

- చిన్న ఆంజనేయులు, మత్స్యకారుడు, శింగనమల మండలం

వర్షాధారంతోనే



బీటీ ప్రాజెక్టుతో పాటు ఇతర చెరువుల్లో వర్షాధారంగా చేపల పెంపకం ఉంటోంది. వేసవిలో చెరువుల్లో, రిజర్వాయర్లు నీరు ఇంకిపోతే మత్స్యకారులకు ఉపాధి ఉండదు. వదిలిన చేపల సైతం బరువు పెరగవు. ప్రస్తుతం బీటీపీ రిజర్వాయర్‌తో పాటు చెరువుల్లో సమృద్ధిగా వర్షపునీరు చేరడంతో చేపల పెంపకం లాభదాయకంగా ఉంది. ఒక్కో మత్స్యకారుడు రోజుకు 20 కేజీల నుంచి 50 కేజీల వరకు వేటాడుకుని విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాడు. రిజర్వాయర్‌కు హంద్రీనీవా జలాలు చేరితే మత్స్యకారులకు నిత్యం చేపల పెంపకంతో ఆదాయం లభిస్తుంది.

- బెస్త శ్రీరాములు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

చారిత్రక సంపద పరిరక్షణ మన బాధ్యత

డీఆర్‌డీఏ పీడీ శైలజ



పురాతన నాణేల ప్రదర్శనను ప్రారంభిస్తున్న శైలజ

అనంతపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక సంపదను పరిరక్షించుకోవడం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత అని డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలలో నిర్వహించిన పురాతన నాణేల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన నాణేలు, స్టాంపుల సేకరణలో గోవిందరాజులుగుప్త, శివప్రసాద్‌ల కృషి అభినందనీయమన్నారు. అతి ప్రాచీన మహాజనపదాల కాలాల నుంచి మధ్యయుగం నాటి మహమ్మదీయ రాజ్యాల కాలాలకు చెందిన బంగారు, వెండి, రాగి, ఇత్తడి నాణెములతోపాటు బ్రిటిష్ కాలం నాటి వివిధ రకాల నాణేలు, వివిధ దేశాలకు చెందిన స్టాంపులు ఇక్కడి పురావస్తు ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి మన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మ్యూజియంను సందర్శించిన విద్యార్థులకు పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్ పురాతన నాణేలు, స్టాంపుల విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, సభ్యులు కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణరెడ్డి, ఫాతిమా మున్నీసా బేగం, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, షేక్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠశాలల సమాచారం

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాల సమాచారం పక్కాగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టారు. అన్నిమండలాల విద్యాధికారు(ఎంఈఓ)లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌కు వచ్చారు.అక్కడ ఆయా మండలాలు, పాఠశాలల వారీగా రాష్ట్ర అధికారులు ఆదేశించిన మేరకు పనిచేస్తున్న టీచర్ల వివరాలు, వారి పొజిషన్‌ఐడీలు, క్యాడర్ స్ట్రెంథ్, ఓఆర్‌జీఐడీ సమాచారాన్ని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో పక్కాగా సమాచారం తీసుకుని, అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో వివరాలను ఐటీ సెల్ సిబ్బంది ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు నమోదు చేశారు. ఇందులో పొరబాట్లు దొర్లితే ఆయా ఎంఈఓలు, హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఈఓ ప్రసాద్‌బాబు హెచ్చరించారు.

టమోటా @ 50

భారీగా పెరిగిన ధర

అనంతపురంరూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర భారీగా పెరిగింది. కిలో ధర ఏకంగా రూ.50కి చేరింది. కొన్ని రోజులుగా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో కాయలు లేకపోవడం, ఎగుమతి ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి ఉండడం ధర పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం గరిష్ఠంగా కిలో రూ.50తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.27, సరాసరి రూ.37తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,875 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

రేపు పంచాయతీల్లో గ్రామ సభలు

అనంతపురం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22న జాబ్ కార్డులు, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ సలీం బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభల్లో జాబ్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేసిన నేపథ్యంలో తొలగించిన కూలీల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. కూలీలకు పనులు కల్పించడంపైనా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

అనంతలో సీపీఐ వందేళ్ల వేడుకలు

10న నిర్వహణకు ఏర్పాట్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల వేడుకలను డిసెంబరు 10వ తేదీన అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జగదీష్ మాట్లాడుతూ.. డిసెంబరు 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతుందన్నారు. ఈనేపథ్యంలో డిసెంబరు 10వ తేదీన అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో వందేళ్ల వేడుకలు నిర్వహిస్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న క్రియాశీలక కుటుంబాలు, నాయకులతో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేస్తామన్నారు. వేడుకలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, రామక్రిష్ణ, పద్మావతి, లింగమయ్య, రమణయ్య, రాజేష్, రమణ, సంతోష్, కుళ్లాయిస్వామి, చిరంజీవి, చెన్నప్ప, పెద్దయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి నైపుణ్య పోటీలు

అనంతపురం విద్య, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు ఈనెల 22న జిల్లా స్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 73 పాఠశాలల్లో ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వివిధ విభాగాలలో నైపుణ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో ఒకేషనల్ ట్రైనర్ ద్వారా రెండు నమూనాలతో బుక్కరాయసముద్రం కేజీబీవీలో జరిగే ప్రదర్శనకు విధిగా హాజరు కావాలని ఏపీసీ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీఓల సెలక్షన్ జాబితా విడుదల

అనంతపురం న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓల సెలక్షన్ జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం మెమో నెంబర్ 3031131-జీడబ్ల్యూఎస్01-2025 జారీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం పరిధిలో పని చేసే గ్రేడ్-1 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు గత 15 రోజుల నుంచి డిప్యూటీ ఎంపీడీఓల ప్రమోషన్ల జాబితా ఎప్పుడెప్పుడు ప్రకటిస్తారా అని వేచి చూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఎంపిక జాబిత విడుదలైంది. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఎంపికైన వారికి మండల స్థాయిలో పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సొంత మండలానికి కేటాయించకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరిని డెప్యుటేషన్‌పై మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారులుగా నియమించనున్నారు.

భారత బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు పావని



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన పావని ఎంపికైంది. ఈమె జనవరి 1 నుంచి నేపాల్ దేశ రాజధాని ఖాట్మాండులో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భారత మహిళా జట్టు తరఫున ఆడనున్నారు. దేశం తరఫున ఆడే అవకాశం కల్పించిన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాజారాం, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ శంకర్‌రెడ్డి, బాలాజీ, ఉపాధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులుకు ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్ బాక్స్

చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించండి

● అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకం, సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం ఆయన ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇటీవల శంకుస్థాపన చేసిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణాలపై ఆరా తీశారు. సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో రూ. 16 కోట్ల వ్యయంతో చేపట్టిన పార్కు ఏర్పాటుపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి భవనాలు నిర్మిస్తున్నారు.?, ఎప్పటికి పూర్తవుతాయి.. తదితర అంశాలను తెలుసుకున్నారు. కొత్తగా వచ్చే వారిని, చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సహించాలన్నారు. ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ దేవకాంతమ్మ, అధికారులు విశ్వ, సాగర్ పాల్గొన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కును అందజేస్తున్న వీసీ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న జమున ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ వారు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసి ధాతృత్వాన్ని చాటుకున్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు చేతుల మీదుగా గురువారం అందుకు సంబంధించిన చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి మారుతి, ఉపాధ్యక్షుడు నాగముని, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహులు, స్పోర్ట్స్ సెక్రటరీ ఇలియాజ్ పాల్గొన్నారు.

సహకార సంఘాలతో ఆత్మ నిర్భర్ భారత్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు పేర్కొన్నారు. అఖిలభారత సహకార వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో జరిగాయి. చైర్మన్ నెట్టెం వెంకటేశులు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరలకు అందిస్తామన్నారు. డీసీఎంఎస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రజలకు మరిన్ని సేవలను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం సహకార ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, జిల్లా సహకార విద్యాధికారి మురళీమోహన్, డీసీఎంఎస్ మేనేజర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంటలోగల బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, సైన్స్ జూనియర్ కళాశాలలో 1000 లీటర్ల సామర్థ్యం గల రెండు ఆర్వో ప్లాంట్లను సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ప్రతాపరెడ్డి ముత్తూట్ ఫైనాన్స్ వారి సహకారంతో ఏర్పాటు చేయించారు. వాటిని గురువారం ఆయనతో పాటు పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు సునీత, విజయలక్ష్మి, ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు ప్రారంభించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గార్లదిన్నె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనార్టీ (ఏపీఆర్) స్కూల్‌కు చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 18న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజినేయులు నాయక్ తెలిపారు. 47 మీటర్ల జావెలిన్ త్రో పోటీల్లో అర్బాజ్‌ఖాన్, షాట్ పుట్‌లో మూర్తజ్‌వలి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం వారిని పాఠశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

కనగానపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టకనుమ వద్ద గురువారం కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చంద్రానాయక్ అనే వ్యక్తి కారులో కళ్యాణదుర్గం నుంచి ధర్మవరం వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని పుట్టకనుమ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ముళ్లపొదల్లోకి దూసికెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభం నుంచి పడి కార్మికుడికి..

కనగానపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాచెర్ల గ్రామంలో గురువారం ఓ కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు విద్యుత్ స్తంభం నుంచి కిందపడి గాయపడ్డాడు. మామిళ్లపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి చంద్రాచెర్ల ఫీడర్‌లో పోల్ టు పోల్ కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం చంద్రాచెర్లలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాల ఢీ



అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో గల 80 అడుగుల రోడ్డు సర్కిల్లో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఆ వాహనదారులు కింద పడిపోయారు. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలి

● ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదు

● ప్రజాదర్బార్‌లో అధికారులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశం


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని అధికారులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మండల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఆమెకు వినతిపత్రాలు సమర్పించారు. ఎక్కువగా భూమి, ఇళ్లు, పింఛన్ల సమస్యలపై వినతులు ఇచ్చారు. వాటిని ఎమ్మెల్యే స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజా సమస్యల కోసం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలే విశేషంగా తరలివచ్చి సుమారు 200 దాకా వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రజాదర్బార్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, డీఈ కృష్ణజ్యోతి, సీడీపీఓ లలితమ్మ, జేఈలు రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు, సాయినాథ్, ఎంఈఓ శివప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు మారుతినాయుడు, డేగలక్ష్మణమూర్తి, ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి మధుయాదవ్, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పూజారి వద్దంటూ ఆందోళన

శింగనమల దుర్గాంజనేయస్వామి పూజారి సిరి రమణాచారి గత 20 రోజుల నుంచి గ్రామంలో వైసీపీ, టీడీపీ పార్టీల మధ్య చిచ్చు పెడుతూ అసత్యప్రచారాలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, ఆ పూజారి మాకొద్దు అంటూ స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాదర్బార్ జరుగుతున్న ప్రాంతం వద్దకు వచ్చి అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. పూజారి దుర్గాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీకి ఆలయానికి సంబంధించిన తాళాలు ఇవ్వకుండా ఉన్నారని, అడిగితే ఆత్మహత్య చేసుకుంటాను అని బెదిరిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారని వాపోయారు. గ్రామానికి చెడ్డపేరు తీసుకొస్తూ ఇక్కడి వైసీపీ, టీడీపీ పార్టీల మధ్య చిచ్చు పెటుతున్న ఈ పూజారి మాకొద్దు అంటూ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యను తెలుసుకున్నారు. పూజారిపై చర్యలకు దేవాదాయ, పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించి ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు.

నాడు గళమెత్తినందుకు.. అక్రమ కేసులు

● ఏపీ మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు


కోర్టు ఆవరణలో ప్రకాష్ నాయుడు

అనంతపురం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నాటి నాయకుల దుర్మార్గాలను, అరాచకాలను ప్రశ్నిస్తూ... గళమెత్తినందుకు తనపై అక్రమ కేసులు బనాయించారని ఏపీ మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. 2020లో అప్పటి జగన్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుకు సంబంధించి అనంతపురం స్పెషల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఐదేళ్ల కిందట వైసీపీ అరాచకాలపై గొంతువిప్పామన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడానికి, కార్యకర్తలతో సమావేశం కావడానికి చంద్రబాబు 2020లో అనంతపురం వచ్చారన్నారు. ఈ సందర్భంగా అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులపై విమర్శలు చేసినందుకు తనపై అక్రమంగా కేసులు బనాయించారని తెలిపారు. ప్రజాక్షేత్రంలో నడిచే నాయకులపై అప్రజాస్వామికంగా ఎన్ని కేసులు పెట్టినా.. నిలబడవని పేర్కొన్నారు.

కాంప్లెక్స్‌లకు అందరూ హాజరుకావాలి

● డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశం

అనంతపురం విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు వందశాతం టీచర్లు హాజరు కావాల్సిందేనని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ప్రకటనలో ఆదేశించారు. శనివారం జరిగే ఈ సమావేశాలకు స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీచర్లు వారికి కేటాయించిన కేంద్రాలలో హాజరు కావాలన్నారు. క్లస్టర్ మీటింగ్‌లకు హాజరు కాని టీచర్లపై నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

అనంతపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి, 12, 14 మెమోలను రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లకు నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాటాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డును వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఏడాది దాటుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మన్నీల రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సీఐటీయూ నగరాధ్యక్షుడు వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ఎర్రిస్వామి, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఇర్ఫాన్, నాగేంద్ర, కళావతి, సీఐటీయూ నాయకులు హనుమంతరెడ్డి, మల్లేష్, రంగనాథ్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అంధులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని వినతి


భువనేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న శివానంద

అనంతపురం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అంధులకు ప్రత్యేక దర్శనాలు కల్పించాలని ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే శివానంద సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని కోరారు. కుప్పంలో ఉన్న ఆమెను గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే అంధులకు ప్రత్యేక దర్శనం కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఇందుకు భువనేశ్వరి సానుకూలంగా స్పందించినట్లు శివానంద తెలిపారు.

తరిమెల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం తనిఖీ

శింగనమల: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ జయలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కుష్ఠువ్యాధి గ్రస్థుల గుర్తింపునకు జరుగుతున్న ఇంటింటి సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత తరిమెలలో జరుగుతున్న సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఎంఓ నాగన్న, జిల్లా సూపర్ వైజర్లు రమణ,మహేశ్,మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, సీహెచ్ఓ గంగాధర్,చంద్రశేఖర్,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురంరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 29టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కుష్ఠు లక్షణాలపై అవగాహన


యర్రగుంట్లలో కుష్టుపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

గార్లదిన్నె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వైద్యులు, సిబ్బంది కలిసి కుష్టు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 30 వరకు ఇంటింటికీ వైద్య సిబ్బంది తిరిగి కుష్టు పీడితుల గుర్తింపునకు సర్వే చేస్తున్నారన్నారు. కుష్టు పీడితులను గుర్తించి వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స చేయనున్నట్లు చెప్పారు. కుష్టు సోకితే శరీరంపై రాగి రంగులో స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బుడిపెలు వస్తాయన్నారు. అదేవిధంగా కనుబొమ్మల, కనురెప్పల వెంట్రుకలు రాలిపోతాయన్నారు. ముక్కుదూలం అణిగి పోయి ఉండడం, బొటనవేలు, చిటికెన వేలు, మణికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్ల నేలకు రాసుకుపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావటం వంటి లక్షణాలు ఉంటాయని ప్రజలకు తెలిపారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే 18 ఏళ్ల వయసు పైబడిన స్త్రీలు, పురుషులకు క్యాన్సర్ పరీక్షలు కూడా చేస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్, కుష్టు లక్షణాలు ఉంటే ఆందోళన చెందకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


గార్లదిన్నె గ్రంథాలయంలో విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

చెన్నేకొత్తపలి/రామగిరి/గార్లదిన్నె/శింగనమల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. చెన్నేకొత్తపల్లి మండలకేంద్రంతోపాటు మేడాపురంలోని శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంపీడీఓ బాలకృష్ణుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణ, గ్రంథాలయ అధికారులు జయరాం, చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రామగిరి గ్రంథాలయంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సర్వేశ్వరి, కేజీబీవీ ఎస్ఓ సౌమ్యలత, ఉన్నతపాఠశాల హెచ్ఎం రవి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రమణ పాల్గొన్నారు. ఇక గార్లదిన్నె గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు మాదవి, విజయ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి శిరీష పాల్గొన్నారు. అలాగే శింగనమల జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పరుగు పోటీలు జరిపి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్ఎం చంద్రకళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సీకేపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ


శింగనమలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఎరువుల దుకాణాల తనిఖీ

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేటలోగల పలు ఎరువుల దుకాణాలను గుత్తి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు గురువారం తనిఖీ చేశారు. ఇంటర్ డివిజన్ తనిఖీల్లో భాగంగా రుద్రంపేటలోని న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్, గుత్తిరోడ్డులోని ఉమా గోడౌన్‌ను మండల వ్యవసాయాధికారి వెంకటర్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. న్యూశ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో రాయల్ ఆగ్రో లైఫ్ సైన్స్ కంపెనీకి సంబంధించిన రూ.97,272 విలువ గల 1.2 మెట్రిక్ టన్నుల హై జింక్‌ను, ఉమా గోడౌన్‌లో ఫార్మా మాట్రిస్ కంపెనీకి చెందిన రూ.2.08లక్షల విలువ చేసే 220లీటర్ల ఫోర్ఎస్ ఎరువులను లైసెన్స్ లేకపోవడంతో సీజ్ చేశారు.

రేకులకుంటలో కంటి వైద్యశిబిరం

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ ఓటీపీఆర్ఐ జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో గురువారం బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటైంది. ఓటీపీఆర్ఐ సంస్థ సంచాలకులు సుబ్బారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని కంటి సమస్యలున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ ఫార్మసీ ప్రిన్సిపాల్ గోపీనాథ్, మండల ప్రజా పరిషత్ పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో న్యాయవాదుల ప్రచారం


ప్రచారం చేస్తున్న లాయర్లు

అనంతపురం క్రైం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది యలమంజుల బాలాజీ గెలుపునకు కృషి చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. ఈ మేరకు అనంతపురం కోర్టు ఆవరణలో గురువారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. కోర్టు ఆవరణ అంతా కలియతిరుగుతూ.. ఓట్లు వేయాలని కోరారు. బాలాజీని గెలిపిస్తే... న్యాయవాదులకు ఎలాంటి సంక్షేమం జరుగుతుందో వివరించారు. మహిళ న్యాయవాదులు సైతం ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తిరుపతి నాయుడు, బుడేన్ సాబ్, లేపాక్షి నాయుడు, హైకోర్టు న్యాయవాదులు రాజేంద్రప్రసాద్, ప్రసాద్, బాలకృష్ణ, సుబ్బన్న, లక్ష్మిప్రసాద్, నారాయణ, నరసింహులు, ధర్మంసింగ్ నాయక్, సుదర్శన్, హర్షవర్ధన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉర్దూ టీచర్లకు సన్మానం


ఉత్తమ ఉర్దూ టీచర్లతో మైనార్టీ వెల్ఫేర్ డీడీ రామసుబ్బారెడ్డి

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉత్తమ అవార్డులు అందుకున్న ఉర్దూ టీచర్లను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ సన్మానించింది. రాష్ట్రస్థాయిలో ఏడుగురు, జిల్లా స్థాయిలో పలువురు ఉత్తమ ఉర్దూ టీచర్లుగా ఎంపికవగా.. వారికి జాతీయ విద్యా దినోత్సవం రోజున ప్రభుత్వం అవార్డులు అందించింది. ఈ అవార్డులు పొందిన ఉత్తమ ఉర్దూ టీచర్లను స్థానిక జిల్లా మైనార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా వెల్ఫేర్ డీడీ రామసుబ్బారెడ్డి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డీడీని ఉర్దూ టీచర్లు సన్మానించారు. కార్యక్రమంలో డీఐఓ దావూద్, పలువురు ఉర్దూ టీచర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి ఏడీసీసీబీ చైర్మన్ ఆర్థిక సాయం

గార్లదిన్నె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరు గ్రామంలో హరిజన నల్లప్ప కుమార్తె వివాహానికి రూ. 10వేలను ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అందజేశారు. ఆ నగదును స్థానిక టీడీపీ నాయకుల ద్వారా పంపిణీ చేయించారు. అదేవిధంగా కల్లూరులో ఇటీవల జామకాయల దాదా భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి రూ. 10వేలను స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. అలాగే కల్లూరులో పలువురు తెలుగుయువత నాయకులు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, వడ్డేవన్నూర్, బాబయ్య, గంగాధర్, శ్రీనాథ్, అశోక్, జగదీష్, బాషా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున అన్నదానం

అనంతపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపును పురస్కరించుకుని గురువారం పాతూరు ఉమానగర్‌లోని రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నగరపాలకసంస్థ మాజీ మేయర్ రాగే పరశురాం, కార్పొరేటర్ నాగమణి హాజరై ప్రారంభించారు. దాదాపు 1600 మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, ప్రసన్న, నాగరాజు, గోసల లక్ష్మన్న, నవీన్, మంజు, హేమంత్, రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

గార్లదిన్నె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు, కోటంక, కృష్ణాపురం, బూదేడు, సంజీవపురం, కొప్పలకొండ, యర్రగుంట్ల, పెనకచెర్ల, డ్యాం, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం ఎస్టీయూ నాయకులు సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ వినహాయింపుపై ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశామని, దీనిపై విద్యాశాఖ మంత్రి చొరవ చూపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇతర బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి వెంటనే ఏఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రామకృష్ణ, సాంబశివుడు, షంషీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

జూడో టోర్నీకి ఎస్కేయూ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ అనిత తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న భాస్కర్ 81 కిలోల విభాగంలో జూడో టోర్నీకి ఎంపికయ్యాడు. ఈసందర్భంగా ఆ విద్యార్థిని గురువారం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిత అభినందించారు. ఈసందర్భంగా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ మాట్లాడుతూ..రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఈనెల 24 నుంచి 28వతేదీ వరకు ఖేలో ఇండియా జూడో టోర్నమెంట్ జరగనున్నట్లు తెలిపారు. అందులో వర్సిటీ నుంచి ఈవిద్యార్థి పాల్గొనన్నుట్లు చెప్పారు. కోచ్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని జే వెంకటంపల్లిలో గురువారం ఆంజనేయస్వామికి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని పురవీధుల్లో ఊరేగించారు. నందికోలాటాల మధ్య బాలికల కళశాల నడుమ రథోత్సవం సాగింది.

నేడు ప్రజాదర్బార్

గుత్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

● గుమ్మఘట్ట: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ కన్వీనర్ కాలవ సన్నన్న పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

నేడు ఉపాధి కూలీల గ్రామసభలు

శెట్టూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో 16 గ్రామ పంచాయతీలలో ఉపాధి కూలీల కోసం గ్రామసభలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ నీరజ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీలు నూతన జాబ్‌కార్డు కోసం, పనుల కోసం, రద్దయిన జాబ్ కార్డు పునరుద్ధరణకు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● ఉరవకొండ: మండలంలోని గ్రామపంచాయతీల్లో శనివారం జాబ్‌కార్డుల కోసం గ్రామసభలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈకేవైసీ సమస్యలతో రద్దు అయిన, తొలగించిన జాబ్‌కార్డులు పరిశీలించి, అర్హులైతే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలు నిర్మించండి

గుంతకల్లుటౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. కాలువల నిర్మించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారని, అయినా ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘం అధ్యక్షుడు జీ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు ఉన్నారు.

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మేజరు పంచాయతీ పరిధిలో స్థలం ఉండి ఇళ్లు లేనివారు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి గౌస్ సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంటి పట్టా, ఆధార్ కార్డు తీసుకుని నెలాఖరులోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు

ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

గుత్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఉప కమిషనర్ (డీసీ) నాగమద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. బెల్ట్‌షాపులను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. జనవరి నుంచి ఇప్పటిదాకా 1,101 బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, 1,105 మందిని అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐ ఉమాదేవి, ఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా చీకలగురికి



ట్యాంక్ నుంచి వృథా అవుతున్న తాగునీరు

విడపనకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకలగురికి గ్రామం అపరిశుభ్రంగా మారింది. ఏడాదిగా డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. బీసీ కాలనీ సమీపంలో మంచి నీటి ట్యాంక్‌కు కొళాయిలు లేకపోవడంతో నిత్యం తాగునీరు వృథా అవుతూనే ఉంటుంది. ఆ నీరు చుట్టుపక్కల ప్రాంతంలో, గ్రామంలో నిల్వ ఉంటోంది. దీంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలూ విపరీతంగా పెరిగాయి. గ్రామం మొత్తం అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు అధికంగా పెరిగి.. ఆరుబయట కూర్చోలేక పోతున్నామని, అనేక మంది రోగాల బారిన పడుతున్నారని ఆ గ్రామస్థులు వాపోతున్నారు.

పొదుపు సొమ్ము భద్రమేనా?

● పలు సంఘాల్లోని రూ. లక్షలు మాయం
● స్పందించని అధికారులు

పుట్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు దాచుకున్న పొదుపు సొమ్ము భద్రమేనా అనే అనుమానాలను ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు లేకెస్తున్నాయి. డ్వాక్రా సంఘాల్లోని మహిళా పొదుపు డబ్బులను యానిమేటర్లు, సీసీలు జమ చేయాల్సి ఉన్నా... కొందరు ఆ సొమ్మును తమ సొంతానికి వాడుకుంటున్నారు. మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇప్పటికే లక్షలాది రూపాయలు అవినీతి జరిగింది. ఆ సంఘాల్లోని డబ్బులను యానిమేటర్లు, సీసీలు బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్నారు. పొదుపు సొమ్ము ఇచ్చినట్లు రికార్డులు సరిగా లేకపోవడం.. వాటిని లిఖిత పూర్వకంగా రాయడాన్ని ఆసరాగా తీసుకున్న సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.



పుట్లూరు ఐకేపీ కార్యాలయం

● రసీదులు ఇవ్వరు

సంఘంలో సభ్యులు పొదుపు డబ్బులు యానిమేటర్‌కు ఇస్తారు. సభ్యులు డబ్బులు ఇచ్చినా సంబంధిత యానిమేటర్, సీసీలు రసీదులు ఇవ్వరు. సంఘాల్లోని సభ్యులు పొదుపు డబ్బులు ఇచ్చినా కొంతమంది సిబ్బంది మాత్రం తమకు ఇవ్వలేదంటూ సభ్యులను మోసం చేస్తున్నారు. పైగా తమకు డబ్బులు ఇచ్చినట్లు ఆధారాలు చూపాలని బకాయిస్తున్నారు.

● వైసీపీ పాలనలో..

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మండలంలోని శనగలగూడూరులో యేసయ్య గ్రూప్‌కు చెందిన సంబంధించి రూ.2.10 లక్షల మేర డబ్బులు తేడావచ్చింది. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని సభ్యులు అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది. పుట్లూరులో ఓ సంఘంలో సుమారు రూ.3 లక్షలు మేరా తేడాలు రావడంతో సభ్యులు నేరుగా ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కడవకల్లులో ఓ యానిమేటర్ ఏకంగా సంఘంలోని సభ్యుల పేరిట రూ.1.30 లక్షలు రుణం తీసుకొని, బాధిత మహిళలతో ఆ మొత్తాన్ని కంతుల రూపంలో కట్టించాడు. ఇలా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని మహిళా డ్వాక్రా సంఘాల్లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిపై ఐకేపీ ఏపీఎం వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా.. శనగలగూడూరులో సంఘంలోని సమస్య గత ప్రభుత్వంలోనే నాటి సీసీ, కొందరు సిబ్బంది చేశారని, ప్రస్తుతం మండలంలో ఎలాంటి సమస్యలూ లేవని తెలిపారు.

మురుగు కాలువ సమస్యపై సమాలోచన



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీకట్ట వద్ద నుంచి నంద్యాల రోడ్డు వరకు ఉన్న మురుగునీటి కాలువతో పట్టణ వాసులు అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మున్సిపల్ అధికారులు, స్థానికులతో కలిసి గురువారం ఆ కాలువను పరిశీలించారు. ఆ కాలువ స్థానంలో భూగర్భ కాలువను ఏర్పాటు చేసి.. దానిపై రోడ్డు వేస్తే సమస్య పరిష్కారమవుతుందనే నిర్ణయానికి వచ్చారు. కాలువ నిర్మాణానికి రూ. కోటి, దానిపై రోడ్డు నిర్మాణానికి రూ. 1.5 కోటి .. మొత్తం రూ. 2.5 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం మున్సిపాల్టీలో నిధులు లేకపోవడంతో తాను కొంత సొంత డబ్బులు ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించగా.. మిగిలిన డబ్బులు ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారు. దీంతో రెండు నెలల్లో పనులు మొదలుపెట్టి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, లోకనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

● కాలువల పరిశీలన

పెద్దపప్పూరు/ పుట్లూరు : పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట రిజర్వాయర్ కాలువను, పుట్లూరు మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఉన్న తాడిపత్రి బ్రాంచ్ కాలువను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం పరిశీలించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం



సమావేశానికి హాజరైన ముగ్గురు సభ్యులు

యాడికి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామపంచాయతీ కార్యాల యంలో గురువారం నిర్వహిం చిన పాలకవర్గ సమావేశానికి 20 మంది వార్డు సభ్యులకు గాను కేవలం ముగ్గురు సభ్యులు దేవి, పార్వతి, సావిత్రి మాత్రమే హాజరయ్యారు. గ్రామ సర్పంచు అనురాధ, ఉప సర్పంచు చంద్రమోహన్ సహా మిగిలిన వార్డు సభ్యులూ గైర్హాజర్ అయ్యారు. ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులైన వైసీపీ నాయకులు నిర్లక్ష్యం చూపడం పలు విమర్శలకు తావిస్తోంది.

పొంచి ఉన్న ప్రమాదం

బొమ్మనహాళ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లనగుడ్డం గ్రామ శివారులో త్రీఫేస్ విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాల్లోకి వ్యవసాయ సామగ్రిని తీసుకెళ్లే సమయంలో ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ తీగలను సరి చేయాలని లైన్‌మన్‌ను కోరితే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని స్థానిక రైతుల గోపాల్ ఆరోపించారు. దీనిపై బొమ్మనహాళ్ విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డిని వివరణ కోరగా.. త్రీఫేస్ వైర్లు కిందకు ఉన్నట్లు తన దృష్టికి రాలేదని, వాటిని పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

కార్తీక అమావాస్య పూజలు

ఉరవకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీక అమావాస్య సందర్భంగా నెరమెట్ల గ్రామం లోని శ్రీ భోగలిం గేశ్వర స్వామి ఆలయంలో గురు వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



భోగలింగేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి

● కళ్యాణదుర్గం: స్థానిక కోట వీధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి గురువారం ఉదయం పంచామృ తాభిషేకం, చందనోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఆర్థికేతర సమస్యలు పరిష్కరించండి



అధికారులతో చర్చిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లతో గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన సమావేశయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిన్నర కాలంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, వివిధ సందర్భాల్లో ప్రజల నుంచి మొత్తం 4,746 ఫిర్యాదులు స్వీకరించామని, అందులో 4,016 సమస్యలను పరిష్కరించామని విప్ తెలిపారు. ఫిర్యాదుల్లో రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలే అత్యధికంగా ఉంటున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సూచించారు.

తాత్కాలిక రోడ్డు, కల్వర్టు నిర్మాణం పూర్తి



కల్లుదేవనహళ్లి వద్ద రోడ్డు, కల్వర్టును పరిశీలిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవనహళ్లి రోడ్డు నుంచి శింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వేదావతి హగరి నీరు ప్రవాహానికి ఆరు నెలల క్రితం కొట్టుకొనిపోయింది. దీంతో శింగానహళ్లి, శ్రీధరఘట్ట, గోవిందవాడ, బండూరు, కల్లుదేవనహళ్లి, కల్లుహోళ తదితర గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. తాత్కాలిక కల్వర్టు, రోడ్డు నిర్మాణం కోసం విప్ కాలవ శ్రీనివాసులు రూ. 25 లక్షలు మంజూరు చేయించారు. ఆ పనులు పూర్తి కావడంతో వాటిని గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, శింగానహళ్లి గ్రామల టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. శాశ్వత వంతెన, రోడ్డు నిర్మించేలా విప్ చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

విశ్వశాంతి కోసం 64 రోజులపాటు దీక్షాయజ్ఞం

రాయదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్లాపురం గ్రామ సమీపంలోని శ్రీవిప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో విశ్వమాత ఆశ్రమంలో విశ్వశాంతి కోసం శ్రీలక్ష్మీనారాయణ స్వామి దీక్ష యజ్ఞాన్ని 64 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, ఆడియన్ శ్రీస్వామిదాసన్ ఏపీ రామ్మూర్తిస్వామి తెలిపారు. గురువారం దేవాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడు తూ.. ఆదివారం నుంచి నిర్వహించే కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.



రామ్మూర్తిస్వామి

మాక్ అసెంబ్లీకి యాడికి విద్యార్థి

యాడికి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అనిల్‌కుమార్ మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు గురువారం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు.



అనిల్‌కుమార్

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

గుంతకల్లుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం, దోనిముక్కల గ్రామాల మధ్య ఈనెల 18న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఇందులో స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఖాజాబీ, 9వ తరగతి చదువుతున్న అపూర్వ ప్రతిభచాటారు. వీరు ఈనెల 21, 22వ తేదీల్లో కృష్ణ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ గురువారం తెలిపారు.



ఖాజాబీ, అపూర్వ

● సాఫ్ట్‌బాల్ పోటీలకు ..

బెళుగుప్ప: అనంతపురంలో ఈనెల 19న నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి హరిసాద్విక్ ప్రతిభ చాటాడు. పులివెందులలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే ఇదే పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి రాజశేఖర్ ఈ నెల 16న అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీల్లో ప్రతిభచాటాడు. ఈనెల 26 నుంచి 28 వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పీడీ గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు.



రాజశేఖర్, హరిసాద్విక్

● వాలీబాల్ పోటీలకు...

పెద్దవడుగూరు : అనంతపురంలో బుధవారం నిర్వహించిన అండర్-14 విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పి. వీరన్నపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లావణ్య, భరత్, కార్తీక్ ప్రతిభ చాటారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



ఎంపికైన విద్యార్థులు

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానల్స్



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ

బొమ్మనహాళ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను 200 యూనిట్లు లోపు వినియోగించే ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు పీఎం సూర్యఘర్ ప్యానల్స్‌ను ఉచితంగా ఇస్తామని, ఈ నెల ఆఖరి నుంచే ప్యానల్స్ అమర్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని రాయదుర్గం విద్యుత్ ఏడీ శ్రీనివాసునాయుడు తెలిపారు. గురువారం బొమ్మనహాళ్‌కు వచ్చిన ఆయన సిబ్బందితో మాట్లాడారు. రాయదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని బొమ్మనహాళ్, గుమ్మగట్ట, డీ. హీరేహాల్, రాయదుర్గం రూరల్ మండలాల్లో ఇప్పటికే 4,718 కుటుంబాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాయని, అర్హులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట లైన్‌మెన్లు రామాంజనేయులు, బసవరాజు, చిదనంద, ఏరిస్వామి, మంజు ఉన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో చికిత్స పొందుతున్న దురదకుంట గ్రామానికి చెందిన కూలీ కురుబ గంగప్ప (40) గురువారం మరణించాడు. బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌లో కట్టెలను గంగప్ప తీసుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి.. అ క్కడి నుంచి బెంగళూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ గురువారం మధ్యాహ్నం ఆయన మరణించాడు. ఆయనకు భార్య రేఖ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో కంప చెట్లలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.76,110, ఏడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పలు మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు గురు వారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు, దినపత్రికలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని ఈ సందర్భంగా వక్తలు విద్యార్థులకు సూచించారు.













